పూర్వం రాజుల కొలువులో రాజనర్తకులనీ, దేవాల యాల్లో దేవదాసీలని వుండేవారు. వీళ్ళ వృత్తి కేవలం రాజుగార్ని, దేవుణ్ని బాగులేనప్పుడు మురిపించడం, రాజు దగ్గరకొచ్చే గొప్పవాళ్ళనీ, దేవుడుదగ్గర కొచ్చే భక్తులనీ మరిపించడం. అయితే వాళ్ళు సామాన్య జనానికి అందుబాటులో వుండరు. మరంచేత ఏ స్టేజికి వెళ్ళిపోయే రంటే వీళ్ళందర్నీ ఓ కులం అన్నారు. వాళ్ళు పెళ్ళి చేసుకోవడానికి వీల్లేదు (పెళ్ళి చేసుకుంటే మగాళ్ళగతేం కావాలి?) వాళ్ళ పిల్లలకు తండ్రి వుండడు. వాళ్ళకి (ఎంత గొప్ప వాళ్ళకి పుట్టినప్పటికీ) సంఘములో గౌరవం, పరువు వగైరాలుండవు – ఇక్కడ సంఘం అంటే వాళ్ళ నాన్నలే.

అయ్యా, మీకింకో విషయం తెలుసా? ఒక మొగాడ్ని మరొక మొగాడు ఏ విధంగాను ఓడించలేకపోయినప్పుడు సామదాన భేధ దండోపాయాలన్నీ విఫలమైనప్పుడు ఆఖరి అస్త్రంగా దేన్ని వదుల్తాడు? ఆఫ్టాల్ ఒక ఆడదాన్ని, మరిం ఈ బ్రహ్మాస్త్రానికి తిరుగులేద్సార్. అలనాడు అమృతాన్ని రాక్షసులు ఎత్తుకొనిపోతే దేవతలు వదిలింది ఒక ఆడదాన్ని.

ఏ మునీశ్వరుడో కఠోర తపస్సు చేసి ఇంద్ర పదవికి ఎసురు పెట్టినా, లేక మరోదేవుఁడికి ముప్పు రాబోయినా అంతటి దేవుడు వాడేది తన మందీ మార్బలాన్నీ కాదు, మారణాయుధాల్ని కాదు, కేవలం ఒక ఆడదాని అండతో.

ఇప్పటికీ మనవాళ్ళు పురాణాల అడుగుజాడల్ని అనుసరిస్తూ అన్ని లెవల్స్‌లోనూ ఆడదాన్ని వాడుకుంటున్న దాఖలాలున్నాయి మరి!

పతిత – పతివ్రత.

రెంటికి తేడా ఒక్క అక్షరం.

ఏకాక్షర నిఘంటువు తిరగేస్తే బహుశా ఆ అక్షరం అర్థం మొగాడు అని వుంటుందేమో!

ఆడదాన్ని పతితగా చేసినా, పతివ్రతగా చేసినా మొగాడే.

ఇద్దరి దగ్గరా మొగాడు తీసుకునేది ఒకటే.

ఇద్దరూ మగాడి మీద ఆధారపడినవాళ్ళే.

కాకపోతే ఒకరు టెంపరరీ, మరొకరు పెర్మనెంటు.

పతివ్రతలు లేకపోయినా ఫరవాలేదు కాని పతితలు లేకపోతే మగవాడు బతకలేడు మరి.

అంచేత అమ్మా! ఇది అనంతం !!!

**(జ్యోతి, 1980)**

# టెన్ కమాండ్‌మెంట్స్

**ప**శువులన్నీ కులాసారా కబుర్లు చెప్పుకుంటూ ఆ వేళ జరిగినవన్నీ నెమరు వేసుకుంటూ ఇళ్ళకెళుతున్నాయి.

పక్షులన్నీ అప్పుడే గూళ్ళకెళ్ళడం ఇష్టంలేక ఆ ఇంటి మీద, ఈ గోడమీద కూర్చుని ఆ వేళ విశేషాలు చెప్పుకుని నవ్వుకుంటున్నాయి.

"టైమెంతవుతుందో" అనుకుంది పార్వతమ్మ.

అయిదు అంది సాయంత్రపు సైరను.

"అమ్మబాబోయ్! అప్పుడే అయిదైపోయింది. ఇంకా ఏ పనీ తెవల్లేదు. సరోజని చూడ్డానికి పెళ్ళివారొస్తారు" కూడా అని హడావిడిగా అటు, ఇటు తిరిగేసి అందరికీ పన్లు పురమాయించేసింది.

పెళ్ళి వారు వచ్చేరు, వెళ్ళేరు.

"పిల్ల నచ్చలేదు. మరికొంచెం రంగుంటే...?"

మరో అయిదుగురు వచ్చేరు. వెళ్ళేరు.

వాళ్ళూ అదే అన్నారు.

నచ్చనిది, మరికొంచెం వుండాల్సింది రంగు కాదు.

కట్నం.

ఆఖరికి ఎలగైతేనేం ఆరోవాడు అమ్మాయికి మార్కులు ఎక్కువవేసి, కట్నం కొంత కన్సెనిచ్చాడు. కుర్రాడి మంచి తనాన్ని తెగ మెచ్చుకున్నారు. అమ్మాయి అదృష్టం అంతే లేదన్నారు. అమాంబాపతు అరవై వేలు ఖర్చయింది. పెళ్ళయిన పదిరోజులకే అతను అమెరికా వెళ్ళిపోయేడు. పిల్లని తరువాత పంపమని, అధిక మాసవని, ఆషాడ మాసవని శ్రావణమాసం నోములని, మూఢం అనీ మొత్తానికో ఆర్నెల్లయినా పిల్లని పంపడం అవలేదు.

❖ ❖ ❖

తెల్లవారు ఝాము.

"టైమెంత అవుతుంది చెప్మా!" అనుకుంది మూడో అంతస్తులో పడుకున్న మాలతి.

"నాలుగు" అంది వెనకింటి వెంటేశంగారి కోడి, తను కుయ్యక పోతే వీళ్లెశరు లేవరో ఏవిటోనని.

దూరంగా టెలిఫోను తీగల మీద ఓ గుడ్లగూబ పక్కనున్న మొగుడ్ని పోయి పడుకుందాం రమ్మని గోలచేస్తోంది.

పరీక్షలు దగ్గరకొచ్చిన పక్షి పిల్లలు పాఠాలు చదువు కుంటున్నాయి.

అంతలో...

ఎక్కడినుంచో భయంకరమైన ఏడుపు.

మూడంతస్తులు పునాదుల్తో కదిలిపోయే ఏడుపు.

అంత హృదయ విదారకమైన ఏడుపు అంతవరకు వినని మాలతి తృళ్ళిపడి లేచింది. భయంతో వళ్ళంతా చవటలు పట్టేసేయి. పక్కన పడుకున్న తల్లిని లేపింది భయంతోనే.

"పాపం! రేపు పదవరోజుకదే పక్కింట్లో. కిందకెళ్ళి తలు పేసుకొని పడుకో" అంది తల్లి పక్కకి వత్తిగిలుతూ.

"అంటే?" ఒక్క నిమిషం అర్ధం కాకపోయినా రెండో నిమిషం అర్థం అయింది.

భగవాన్! ఎంత దారుణం!

పక్కింటి సరోజ మొగుడు అమెరికా వెళ్ళి ఆర్నెల్లైంది. పెళ్ళై ఆర్నెల్ల పదిహేనురోజులయింది.

అక్కడతను తాగి తాగి గుడ్లు పేలి చచ్చిపోయేట్ట. వాడి ఖర్మ. తాగి చాలామంది ఛస్తున్నారు. అందులో యితనొకడు. కాని సరోజకి పాతికేళ్ళు కూడా లేవు.

ఇదిగో పసుపు, అదిగో ముసుగు.

రేపు పదవరోజు. అంటే...

ఆ అమ్మాయికి తెల్ల చీరకట్టి, బలవంతంగా బొట్టు.... ఇంక ఆలోచించలేకపోయింది.

"అమానుషం" అని గట్టిగా అరిచింది.

"ఏ విటమ్మా ఈ అన్యాయం. వాళ్ళంతా చదువు కున్నవాళ్ళు. మంచి మోడర్న్‌గానే వుంటారు. మరి.."

"పూర్వం నుంచి వస్తున్న ఆచారం... వద్దనుకుంటే పోతుందా?" అది వాళ్ళమ్మ ఆవలిస్తూ...

"పళ్ళు రాలగొడితే పోతుంది" అనుకుంది మాలతి.

ఆ అమ్మాయి ఏడుపు ఇంకా వినిపిస్తూనే ఉంది. ఏడు లోకాలు దాటి పారిపోయినా వెంబడించే ఏడుపు.

❖ ❖ ❖

అవధానిగారికి ఆరుగురమ్మాయిలు. వాళ్ళింట్లో ఎప్పుడూ సంవత్సరం పొడుగునా ఏదో ఒకమ్మాయి పురుటికొస్తుంది. ఒక్కొక్క పురుటికి ఎంతలేదన్నా ఈ రోజుల్లో వెయ్యి రూపాయ లౌతాయి. ఒక్కొక్క అమ్మాయికి యిద్దరు లేక ముగ్గురు పిల్లలు పుట్టినా, ఆరురెళ్ళు పన్నెండో, ఆరుమూళ్ళు పద్దెనిమిదో పురుళ్ళు పోయాలి. అంటే పెద్దనిమిది వేలు. పైసలు కాదు. రూపాయలు!

"ఏవిటీ అన్యాయం!" అని నాలాంటి పాపాత్ములు అడిగితే "ఆడపిల్ల పురుడు పుట్టింటి వారుపొయ్యడం ఆచారం" అంటారు.

అవును మరి. మన ఆచారాలుఒకటా? రెండా?

అందులో అతి ముఖ్యమైన టెన్ కమాండ్‌మెంట్స్ లాంటివి :

1. పెళ్ళి చూపులు ఆడపిల్ల ఇంట్లోనే.
2. పెళ్ళి ఆడపిల్ల ఇంట్లోనే.
3. కట్నం ఆడపిల్ల యివ్వాలి.
4. ప్రతి పండుగకి అత్తవాడు అల్లుడ్ని బహుమానించాలి.
5. కాపరానికి సరిపోయే సామానంతా పిల్లే తెచ్చుకోవాలి.
6. కడుపుతో వుంటే సీమంతం పుట్టింటి వారే చెయ్యాలి.
7. పురుడు, నామకరణ వగైరా పుట్టింటి ఖర్చే.
8. మూడో నెలని తల్లిని, పిల్లని దిగబెట్టాలి.
9. ఖర్మకాలి మొగుడుపోతే పదవనాడు కట్టే తెల్లచీర కూడా కన్నవారి ఖర్మే.
10. ఆఖర్న ఆడపిల్ల తండ్రి అడుక్కుతినాలి.

నాకిప్పటికీ అర్థం కాని విషయం ఈ ఆచారాలన్నీ ఆడవాళ్ళ పరమైనవే. ఏ మొగాడ్నీ ఏ ఆచారం బాధించగా నేను చూడలేదు.

ఆచారాలు ఆకాశంలోంచి రాలలేదు. భూమిలోంచి మొల వనూ లేదు. కేవలం స్వయంకృతాపరాధాలు.

అల్లప్పుడెప్పుడో......

మొగుడు హరీమంటే, వాడితో పాటు పెళ్ళాం కూడా కృష్ణా అంటూ కాలిపోవల్సిందే. వాడికి కర్రల ఖర్చు లేదు. పెళ్ళావేం కర్రలుగా పనికొచ్చేదేమో! అంటే పెళ్ళైన దగ్గర్నుంచి ఆడదానికి భయం పట్టుకుంటుంది. వీడు ఎప్పుడు కునికేస్తాడో ఏమిటోనని, ఎప్పుడూ మప్టీలో వున్న యమధర్మరాజులా మొగుడు ఎదురుగా తిరుగుతూ వుంటే యింక ఆ మొగుడితో సరదాగా సంసారం ఏం చేస్తుంది? ఈ ఆచారం బహుశా ఎవరో రాక్షసులు పెట్టేరేమో!

కాని మనుషులు పెట్టతగింది కాదు. అప్పుడు మనం మరొకరి చేతికింద వున్నాం. వాళ్ళకి ఇలాంటి భయంకరమైన ఆచారాల్లేవు. అంచేత మా మతంలో చేరితే మీ కిలాంటి కష్టాలేం వుండ వన్నారు వాళ్ళు. బతికుంటే ఏ మతమైఁతేనేవిటి ? అని చాలా మంది వాళ్ళ మతంలో కలిసిపోవడం ప్రారంభించేరు. ఇలా కొనసాగితే కొన్నాళ్ళకి హిందూమతం హిందూ మహా సముద్రంలో కలిసిపోతుందేమోనన్న భయం పట్టుకుంది మత పెద్దలకి. అంచేత కేవలం హిందూ మతోద్ధరణకై సహగమనం తీసేస్తూ ఒక చట్టం చేయించారే తప్ప ఆడదాని మీద జాలితో మాత్రం కాదు.

"ఏ రాయైతేనేం పళ్ళూడగొట్టడానికని" కారణమేదైనా అప్పటినుంచి ఆడదానికి బతికే హక్కు వచ్చింది.

బతికే హక్కైతే వచ్చింది కాని అది కుక్కబతుకు. మొగుడు పోయిన ఆడది మళ్ళీ పెళ్ళి పేరెత్తకూడదు. ఎంత చిన్నదైనా సరే బొట్టు, జుట్టు, గాజు, పూజ వగైరాలన్నీ తీసేసి, తెల్ల చీరలే కడుతూ (తెల్ల చీర సెక్స్ సింబలా లేక పతివ్రతకు చిహ్నమా? మొదటి రాత్రి మొగుడి దగ్గర కెళ్ళినప్పుడూ తెల్లచీరే, వాడు పోయినా తెల్లచీరే? అదేవిటో) దైవ ధ్యానంతో గడపాలి. ఇంత కంటే వాడితో ఛస్తేనే నయమేమో? .

అయితే పాపం పెళ్ళాం పోయిన మొగాడికి ఏవీ తియ్య నవసరం లేదు. మొగుడితో వచ్చిన మట్టె, మంగళ సూత్రం తీసేసినా అర్థం ఉందేమో కాని, పుట్టుకతో వచ్చిన కట్టు, బొట్టు హక్కుల్ని తీసే అధికారం ఎవరికీ లేదు. అయితే అవన్నీ వుంటే అందంగా వుండి మొగాడ్ని ఆకర్షించి, తద్వారా చెడిపోతుందని భయం. చెడేవాళ్ళకి ఇవేవీ అడ్డు కాదు. ఇక్కడ మనం మొగాడ్ని మెచ్చుకోక తప్పదు. అతను పాపం బొట్టుందా లేదా? పువ్వు లున్నాయా? అని చూడడు. ఉంటే మంచిదే. లేకపోతే మరీ మంచిది. అందుకే కాబోలు "ఆల్ విమెన్ ఆర్ ఎ లైక్ ఇన్ డార్క్‌నెస్" అన్నాడో మహానుభావుడు.

అయితే ఈ మధ్య మనం ఆడదాని జుత్తు జోలికి పోనంత ప్రోగ్రెస్ అయ్యేం! ఆఖరికి ఆడది తన బొట్టు, కాటుక, పువ్వులు లాక్కోకుండా చట్టం చెయ్యాల్సిందేనేమో?

"తలలు బోడులైన తలపులు బోడులా" అని మొగుడితో పాటే వాంఛలు కోరికలు పోవు. వాటికి చుట్టంతోను, శాస్త్రం తోను సంబంధం లేదు. ఆ కోరికల ఫలితాలే అనాధ శరణాలయాలు. అవెంత బాగా నడుస్తున్నాయో అందరికీ తెలుసు. వాటి గురించి ఎంత తక్కువగా మాట్లాడితే అంత మంచిది.

"విడో రీ మేరేజ్ ఏక్టు" వచ్చింది కదా యింకా ఏడుపెందుకూ? అంటారేమో! అవున్నిజమే. కాని చేసుకునే మొగాడేడండీ, కాళ్ళమీద పడిన దానికి కడుపు చేసి పోయే వాడేగాని, ముప్పైమంది పెళ్ళాలు చచ్చినవాడికైనా సరే 'కన్య' కావాలి. పెళ్ళాం పయిన పదకొండో నాడే మళ్ళీ పీటలమీద కూర్చుంటాడు. కన్యాదానానికి కాళ్ళు కడగమని అదేవంటే ఆడదిక్కు లేని ఇల్లు ఎలా అంటారు. మొగాడికి ఆడదిక్కు లేకపోయినా ఫరవాలేదు. వీదికో బోర్డింగు, సందుకో లాడ్జింగు ఉన్నంతకాలం.

మరి మొగదిక్కులేని ఆడదేవౌతుంది సార్? ఎంత చవటైనా సరే మొగుడనే ఉత్సవ విగ్రహం పక్కనుంటే ఆడదానికి మిగిలిన మొగాళ్ళ నుండి రక్షణ అనే దౌర్భాగ్యం మనది.

ఈ మధ్య చాలా మంది పెద్ద మనుషులు అబార్షను లీగలైజు చేసి ఆడదాన్ని నెత్తికెక్కించుకున్నారని వాపోయేరు. మరింక "ఆడదానికి నీతి, జాతీ వుంటాయా?" అంటూ భోరుమన్నారు కొందరు నీతిమంతులు.

ఇంట్లో టించర్ అయోడీన్ ఉంది కదా అని కత్తి పదును చూడ్డం కోసం చెయ్యి కోసుకుంటావాఁ?

మనింట్లో డాక్టరున్నాడు, అతికేస్తాడని చెప్పి కాళ్ళు విరిచీసుకుంటామా?

తిని కూర్చుని ఏ ఆడదీ తన కడుపుపంటని మంటపెట్టుకోవడానికి ఇష్టపడదు. ప్రపంచంలో ఏ బాధా కడుపు మంటతో సమానం కాదని మీ కర్థం అయ్యేటట్టు ఎలా చెప్పగలం? ఒక వేళ జరగకూడనిది (?) జరిగితే, ఆ పిల్లలెంత వరకు బాధ్యులు? వీధి కుక్క పిల్లకున్న పాటి ఆదరణక్కూడా నోచుకోని ఆ పిల్లలు చేసిన పాపం ఏమిటి?

మరంచేత చెయ్యాల్సింది అబార్షను లీగలైజు చెయ్యడం కంటే ముఖ్యమైనది, ప్రతి తల్లి తన కడుపున పుట్టిన పిల్లని ధైర్యంగా పెంచుకోగలిగే పరిస్తితుల్ని కల్పించటం ఆ పిల్లని ఆదరించి, అభిమానించే మంచితనం.

ఒకరో, ఇద్దరో పిల్లలున్న ఆడదానికి మొగుడు పోతే, ఇంకా విడ బతుకు ఏం కావాఁలి? నువ్వు కావాలి గాని, నీ పిల్లలు ఒద్దనడం ధర్మవాఁ?

మీ పెరట్లో అన్నీ మీరు వేసిన మొక్కలేనా? ఏ చిలకో, కాకో తెచ్చి పడేసిన గింజ మొలకై, మొక్కై పువ్వులు పూసి, కాయలు కాస్తే అనుభవించటం లేదూ? ఛీ! ఈ విత్తనం నేను వెయ్యలేదని పీకి పారేస్తున్నారా?

ఎవరి పిల్లల్ని వాళ్లు పెంచుకోవడానికి చట్టాలు కావాలా?

మనక్కావాల్సింది చట్టాలు, అనాథ శరణాలయాలు కాదు.

ప్రతి తండ్రికి వీడు నా కొడుకే అని చెప్పుకోగలిగే గుండె నిబ్బరం, ప్రతి తల్లికి మొగుడున్నా లేకపోయినా తన పిల్లల్ని బాహాటంగా పెంచుకోగలిగే మనోధైర్యం.

నీతిని పవిత్రతని, మంచితనాన్ని, చట్టాల చట్రాల్లో బిగించక పోతే గాని వాటికి గతిలేదా?

**(జ్యోతి, 1980)**

# హరిశ్చంద్రమతి

**ఐ** లవ్‌యు డార్లింగ్ అన్నారు మా వారు. ఓనాడు నేను మంచి పన్లో ఉన్నప్పుడు పిలిచి, అనడమే కాకుండా ఆ లవ్వంతా ఏరై ప్రవహించే చూపొకటి చూసేరు. చూపుల డిక్షనరీ వెతికితే నా మాట నమ్మవూ అని ఆ చూపుకర్థంట! బావుంది. దివ్యంగా ఉంది. ఇంత క్లాసిక్ బోర్ విని చాలా కాలమైంది.

అల్లప్పుడెప్పుడో, ఆర్నెల్లక్రితం...

నక్కలు, పసిపిల్లల గోరీలు త్రవ్వేవేళ,

గుడ్లగూబ కలలోకి వచ్చిన పక్షిపిల్లలు కెవ్వున కేకవేసి తల్లి రెక్కల క్రింద నక్కినవేళ.

ఆ పిల్లల్ని చల్లగాలి ఉయ్యాల లూపిన వేళ.

సెలయేరు జోలపాడిన వేళ.

నేను వెన్నెట్లో డాబామీద నా నవల సినిమా కలగంటున్న సుముహూర్తాన.

ఏమిటోనే అమ్మీ. ఈ మధ్య నిన్ను తెగ ప్రేమించేస్తున్నా నుస్మీ అన్నారు మా వారే.

సినిమా సగంలో ఉన్న నాకు మా వారి డైలాగు తెలుగే అయినా అర్థం కాలేదు. ఆయన కలవరిస్తున్నారా!

నేను కలగంటున్నానా!

ఏమిటోనే అమ్మీ! ఈ మధ్య నిన్ను తెగ ప్రేమించేస్తున్నాను మళ్ళీ అదే డైలాగు.

ఈ డైలాగు నా నవలలోనిది కాదు. ఠక్కున కళ్ళువిప్పేను. ఎదురుగా మా వారు. నేనిప్పుడే ఖూనీ చేసేను. నన్ను క్షమించవూ అన్నంత దీనంగా మొహంపెట్టి కూర్చున్నారు.

ఛ! ఛ! కమ్మటి నవల కల పాడైపోయింది.

ఛర్రున కోపం వచ్చింది.

నిక్షేపంలాంటి నిద్రపాడుచేశారు. యీ పాడుమాట చెప్పడానికా! పడుకోండి పడుకోండి ఊరికే చంపక. మీరు ప్రేమిస్తున్నది నన్ను కాదు, ఇదిగో....

ఈ వెన్నెల్ని,

ఈ మంచుని,

ఆ పున్నాగ పువ్వుల్ని,

వాటి కమ్మటి వాసనని,

కన్నె పిల్లల్లా కన్నుకొడుతున్న ఆ లేత నక్షత్రాల్ని "ఎందు కొచ్చిన సొళ్ళు కబుర్లు కాని, అంతగా నిద్రరాకపోతే ఏదైనా పుస్తకం చదువుకోండి" అన్నాను.

కోపంలోనో, కల మైకంలోనే కసిరేనే కాని ఆ తరువాత పాపం చాలా జాలేసింది. అతని చిన్నబోయిన మొహం చూసి

ఏమో! ఒకవేళ నిజమే చెప్పేరేమో!

అంత ఆశతో చెప్పిన మనిషిని మరెప్పుడూ హర్ట్ చెయ్యకూడదనిపించింది. లేకపోతే అదే డైలాగు యీసారి ఇంగ్లీషులో విన్నప్పుడు మామూలుగానే అయితే.

"బావుంది సార్! మీకేం పన్లేనప్పుడూ, ఏం తోచనప్పుడు నేనెంత పన్లో వున్నా పిల్చి యిలాంటి పిచ్చి మాటలు చెప్పడం వుంది చూసేరూ! బ్రహ్మాండంగా ఉంది. ఎలక్షను స్పీచ్‌లాగ అస్తమానూ అదేమాటా! ప్రియురాలిమీద వుండే దాన్నే ప్రేమ అంటారు. పెళ్ళాంపట్ల వుండేది కేవలం డ్యూటీ. ప్రియురాలే పెళ్ళాం అయితే ప్రేమకూడా డ్యూటీ అయిపోతుంది. పెళ్ళాం ప్రియురాలు అవదు కాబట్టి ఆ రెండో ప్రశ్నేలేదు.

నేనెంత ఫూల్‌నైనా అంతమాత్రం తెలుసు. పోనీ లోక విరుద్ధంగా మీరు నన్ను ప్రేమిస్తున్నారనే అనుకుందాం. అంత